నీళ్లున్నా నిర్లక్ష్యమేల..?

- చెరువులను నింపడంలో వైఫల్యం : జెడ్పి చైర్మన్
- హైవే అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు : ఎమ్మెల్యే గౌరు చరిత
- గ్రామీణ ప్రాంతాల్లో అందని వైద్యం : ఎంపీ బస్తిపాటి నాగరాజు
- బెళగల్ పిహెచ్‌సిలో వైద్యులు లేరు : ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి
- పల్లె పండగలపై కనీస సమాచారం లేదు : జెడ్పిటిసిలు



మాట్లాడుతున్న జెడ్పిచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

'కళ్లెదుటే నీళ్లపుష్కలంగా ఉన్నా చెరువులు, రిజర్వాయర్లు నింపుకోలేని దుస్థితిలో ఉన్నాం. నీళ్లున్నా అధికారుల నిర్లక్ష్యం, వైఫల్యం వల్ల నీటిని సముద్రం పాలు చేసుకుంటున్నాం' అని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో 77 చెరువులను నీటితో నింపడంలో ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని అసహనం వ్యక్తం చేశారు. తాగు, సాగు నీటి కష్టాలు చూస్తున్నా ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని, ఇప్పటికైనా చెరువులను నీటితో నింపాలని అధికారులకు సూచించారు. శనివారం జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం చైర్మన్ అధ్యక్షతన సిఇఒ నాసర రెడ్డి సమక్షంలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, ఆర్థిక ప్రణాళిక, పనులు తదితర అంశాలపై ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ చెరువులను నీటితో నింపడంలో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మహిళ శిశు సంక్షేమం, ఎస్టీ నిధులకు సంబంధించి సెప్టెంబర్‌లో సమావేశం ఏర్పాటు చేసి ఆ నిధులతో పనులు ప్రారంభించాలని పంచాయితీ రాజ్ ఏఈలకు తెలిపినా ఒక్కరు కూడా పట్టించుకోలేదని అన్నారు. వారికి తక్షణమే నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ అధికారులకు తెలిపారు. జెజెఎం పనులకు టెండర్లు వేసి వాటికి తగిన పరిష్కారం చేయాలని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో డ్రైనేజీ, రోడ్లు తదితర పనుల నిమిత్తం ఒక్కొక్క జెడ్పిటిసికి 15 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశామని, అందులో 38 మందికి ఇప్పటికే మంజూరు చేశామన్నారు. మిగిలిన 16 మందికి త్వరలో మంజూరు చేస్తామని తీర్మానించారు. అలాగే జెడ్పి ఆవరణలో హోర్డింగ్ సంబంధించిన వాటిని మరో రెండు నెలలు పెంచేలా తీర్మానం చేశారు.

పద్ధతి లేని పల్లె పండగ...

జిల్లాలో పద్ధతి లేని పల్లె పండగలు నిర్వహించారని, గ్రామ సభల్లో కనీసం తీర్మానం లేకుండా ఎలా పనులు ప్రారంభిస్తారని పలువురు జెడ్పిటిసిలు మండిపడ్డారు. అలాగే పించన్ల పంపిణీలో టీడీపీ కార్యకర్తలు అనామకులతో పంపిణీ చేయిస్తున్నారని, జెడ్పిటిసిలకు, సర్పంచులకు కనీస సమాచారం ప్రోటోకాల్ ఇవ్వడం లేదన్నారు. గ్రామ సభలు, మండల సభలు, జిల్లా పరిషత్ తీర్మాణాలు లేకుండా చేయడం పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముందుకు కదలని క్యాన్సర్ యూనిట్ : ఎంపీ

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ వైద్యం మందగించిందని, ప్రజలకు వైద్యం అందడం లేదన్నారు. చాలా పిహెచ్‌సిలలో ముందులు బయటకు రాసి ఇస్తున్నారన్నారు. కోసిగిలో స్కూల్ భవనం పై కప్పు పెచ్చులు ఊడిపోయిందని, చెట్టు కింద పాఠాలు చెప్తున్నారన్నారు. అలాగే క్యాన్సర్ యూనిట్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు.

బెళగల్ పిహెచ్‌సిలో లేని వైద్యులు : ఎమ్మెల్యే

కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ బెళగల్ మండలంలో పిహెచ్‌సిలో వైద్యులు లేరని ప్రజలు వెనక్కి వెళ్తున్నారన్నారు. మండలంలో నీటి సమస్య ఉండటం వల్ల చాలా మందికి మోకాళ్ళ నొప్పులు అధికం అయ్యాయన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్య శాలలో వైద్యం సరిగా అందటం లేదన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే సరిపోదు : ఎమ్మెల్యే

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ నంద్యాల చెక్ పోస్ట్ నుండి గార్గేయపురం దాకా హైవే పనులు ఆగిపోయాయని మున్సిపల్ అధికారులు, హైవే అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. నిర్లక్ష్యంగా ఉంటే సరిపోదని త్వరగా పూర్తి చేయాలన్నారు. తడకనపల్లె చెరువుకి నిధులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అలాగే ఉమ్మడి జిల్లాలోని పలువురు జెడ్పిటిసిలు వారి మండలాల్లో ఉండే పలు సమస్యలపై మాట్లాడారు. అధికారులు వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, వైస్ చైర్మన్‌లు దివ్య, దిల్షాద్ నాయక్, డిప్యూటీ సిఇఒ వెంకట సుబ్బారెడ్డి, ఏవో జితేంద్ర, ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉల్లి రైతు వేదన..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్రంలోనే అత్యధికంగా ఉల్లి దిగుబడి క్రయవిక్రయాలు జరిగే కర్నూలు ఉల్లి మార్కెట్‌కు ఉల్లి పంట పోటెత్తింది. ఇటీవల వర్షాలు కురిసి ప్రస్తుతం తెరపి ఇవ్వడంతో మళ్లీ వర్షాలు కురిస్తే ఉల్లి కుళ్లిపోతుందన్న అనుమానంతో రైతులు ఉల్లి కోతలపై దృష్టి పెట్టారు. రైతులు అందరూ ఒకే సారి ఉల్లి కోసి మార్కెట్‌కు తీసుకొస్తుండటంతో మార్కెట్‌కు రికార్డు స్థాయిలో ఉల్లి వస్తోంది. ఖరీఫ్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉల్లి సాధారణ సాగు 6 లక్షల ఎకరాలు కాగా ఈ ఖరీఫ్‌లో 5.8 లక్షల ఎకరాల్లో ఉల్లి సాగైంది. కోత సమయంలో వర్షాలు పడటం మళ్లీ ప్రస్తుతం వర్షం తెరపి ఇవ్వడంతో రైతులు ఉల్లి కోతల్లో నిమగమయ్యారు. గతేడాది అక్టోబర్ నెలలో అత్యధికంగా ఒకే రోజు 8,380 క్వింటాళ్ల ఉల్లి కర్నూలు మార్కెట్‌కు వచ్చింది. ఈ ఏడాది అది రికార్డు స్థాయికి చేరింది. ఈ ఏడాది అక్టోబర్‌లో ఒకే రోజు 22వేల క్వింటాళ్ల ఉల్లి వచ్చింది. దీంతో మార్కెట్‌లోని షెడ్లన్నీ ఉల్లితో నిండిపోయాయి. ఉల్లిని ముందు రోజు రాత్రికే వాహనాల్లో తెచ్చి మార్కెట్‌కు చేర్చుకోవాల్సి ఉండటంతో ఉల్లి వాహనాలు మార్కెట్‌కు పోటెత్తుతున్నాయి. ప్రస్తుతం క్వింటా ఉల్లి కనిష్టంగా రూ.444, మధ్యస్తంగా రూ.3,589, గరిష్టంగా రూ.4,581 పలికింది. అదే సమయంలో ఈ నామ్ విధానంలో సర్వర్ సమస్య తలెత్తడంతో ఉల్లి అమ్ముకోవడానికి రైతులు రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. ముందు రోజు రాత్రి ఉల్లిని మార్కెట్‌కు తీసుకొస్తే రెండు, మూడు రోజులు రైతులు మార్కెట్‌లోనే ఎదురుచూడాల్సి వస్తోంది. ఈ నామ్ విధానంలో సాంకేతిక లోపం వల్ల మాన్యువల్ విధానంలోనే మార్కెట్‌లో ఉల్లి క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. మాన్యువల్ విధానంలో ఉల్లి కొనుగోలులో వ్యాపారస్థులు సిండికేట్ అయి రైతుకు ఎక్కువ ధర రాకుండా తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నారు. కర్నూలు మార్కెట్‌లో 220 మంది కమిషన్ ఏజెంట్లు ఉన్నారు. ఈ నామ్ విధానంలో అయితే వారు ధరను ఆన్‌లైన్ నమోదు చేయాల్సి ఉంటుంది. మరో వ్యక్తికి ధర తెలిసే అవకాశం ఉండదు. ఈ నామ్ కాకుండా ఆఫ్‌లైన్ విధానంలో కొంటుండటంతో కమీషన్ ఏజెంట్లు అందరూ మాట్లాడుకుని రైతు పంటకు ధరను నిర్ణయిస్తున్నారు. సీజన్‌లో రైతులు ధర బాగానే పలుకుతుంది. గతేడాది అక్టోబర్‌లో క్వింటా ఉల్లికి గరిష్టంగా రూ.5,598 దక్కింది. ఈ ఏడాది మాత్రం రూ.4500 దాటలేదు. మార్కెట్‌కు వచ్చిన ఉల్లిలో ఎక్కువగా క్వింటా రూ.2500 నుంచి రూ.3500 మధ్య లభిస్తోంది. అంటే రైతుకు కిలోకు రూ.25 నుంచి రూ.35 మధ్య వస్తోంది. బహిరంగ మార్కెట్‌లో మాత్రం ఉల్లి కిలో రూ.60పైనే ఉంది. వ్యాపారస్థులు రైతు దగ్గర నుంచి తక్కువకు కొని మార్కెట్‌లో ఎక్కువ ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ నామ్ విధానం పని చేయకపోవడం వల్ల ధరల ఖరారు, తూకాలు, బిల్లుల చెల్లింపులోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. మార్కెట్‌లో వ్యాపారుల సిండికేటును అరికట్టాలని రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు.

ధరల ధాం..ధాం..

దీపావళి అంటేనే అందరికీ గుర్తుకొచ్చేది కాకపూల వెలుగులు, టపాసుల ధాం..ధాం శబ్దాలు. చాలా మంది అవి లేకుండా దీపావళి పండుగ జరుగదు. దీపావళికి కొనుగోలు చేసే టపాసుల ధరలు ఈ ఏడాది మండుతున్నాయి. గతేడాది కంటే 20 నుంచి 25 శాతం వరకూ ధరలు పెరగడంతో సామాన్యులు టపాసులను కొనేందుకు ఆసక్తి చూపడం లేదు. మరికొంత మంది తక్కువ మొత్తంలో కొనుగోలుతో సరిపెట్టుకుంటున్నారు. ఇద్దరు చిన్నారుల కోసం పది రకాల టపాసులు కొనాలన్నా కనీసం రూ.2వేల వరకూ ఖర్చు చేయా ల్సి వస్తోంది. మధ్య రకం స్పార్కిల్స్(కాకరపూలు) గతేడాది రూ.60 నుంచి రూ.70 ఉండగా ప్రస్తుతం రూ.80 నుంచి రూ.90 ఉన్నాయి. చిచ్చుబుడ్డి బాక్స్ గతేడాది రూ.150 ఉండగా రూ.200కు పెరిగింది. పెన్సిళ్లు గతేడాది రూ.120 ఉండగా రూ.170కు పెరిగాయి. తాళ్లు గతేడాది రూ.120 ఉండగా ఈ ఏడాది రూ.150కు పెరిగాయి. 1000 వాలా టపాసులు గతేడాది రూ.350 విక్రయించగా ఈ ఏడాది రూ.450కు విక్రయిస్తున్నారు. రూ.500 వెచ్చిస్తే కనీసం 3 రకాలు కూడా రావడం లేదు. అధిక ధరల వల్ల చాలా దుకాణాల్లో ఫ్యామిలీ ప్యాక్‌లు తేవడమే మానేశారు.

యురేనియం పరిశీలనకు

వైసిపి హయాంలోనే అనుమతులు

- టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

మాట్లాడుతున్న తిక్కారెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్రెడ్డి ఉన్న సమయంలో కప్పట్రాళ్లలో యురేనియం పరిశీలనకు అనుమతులిచ్చారని టిడిపి కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఆరోపించారు. నేడు ఆలూరు నియోజకవర్గంలోని వైసిపి నాయకులు రోడ్లెక్కి టిడిపి పైనా, సిఎంపై నిందలు వేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. శనివారం కర్నూలు నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆకెపోగు ప్రభాకర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 175 స్థానాలలో కేవలం 11 సీట్లను మాత్రమే ప్రజలు వైసిపికి ఇచ్చారని, అయినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. ఒక పక్క వారి అధినేత జగన్మోహన్ రెడ్డి దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతుంటే వారి అనుచరులు మాత్రం దేవనకొండ మండలంలోని పలు గ్రామాలలో యురేనియం తవ్వకాల కోసం పరిశీలన చేస్తుంటే దానిని ముఖ్యమంత్రి చంద్రమాబునాయుడే చేయిస్తున్నట్లు ప్రజలకు తప్పుడు సంకేతాలిస్తూ ధర్నాలకు దిగుతున్నారని చెప్పారు. ప్రస్తుతం శాంపిల్స్ సేకరిస్తున్నారని, నిర్ధారణ కాలేదన్న విషయాన్ని గుర్తుంచుకుని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు సంయమనం పాటించాలని తెలియజేశారు.

రహదారుల అభివృద్ధే లక్ష్యం

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు నిధులను విడుదల చేసిందని, రహదారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం రహదారుల గుంతలను పూడ్చేందుకు కూడా ఒక పైసా నిధులను విడుదల చేయలేదని విమర్శించారు. శనివారం మిషన్ పాట్ హెూల్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా కర్నూలు నగరంలోని ఐదు రోడ్ల కూడలి (ఆర్ఎస్ రోడ్డు జంక్షన్)లో రోడ్డు మరమ్మతు పనులను మంత్రి టిజి భరత్ ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గుంతల రహదారుల్లో ప్రయాణాలు సాగించలేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. అప్పటి ప్రభుత్వం రోడ్లపై గుంతలను పూడ్చేందుకు కనీస దృష్టి సారించలేదన్నారు. జిల్లాలో మిషన్ పాట్ హెూల్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం కింద మొదటి దశలో 69 పనులను రూ. 11.16 కోట్ల వ్యయంతో 412.15 కిలోమీటర్ల మేర గుంతల రహిత రహదారులు చేపట్టినట్లు తెలిపారు. రెండవ దశలో 171 పనులు రూ.8.71 కోట్లతో 426.55 కిలోమీటర్ల రోడ్లను గుంతల రహిత, ముళ్ళ కంప చెట్లు లేని రహదారులుగా డిసెంబర్ నెలలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఆర్అండ్‌బి ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, ఆర్అండ్‌బి ఈఈ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

మాట్లాడుతున్న ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ స్వాతి

కంటి సమస్యలపై అవగాహన అవసరం

- ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ స్వాతి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కంటి సమస్యల పైన అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ కె.స్వాతి తెలిపారు. శనివారం సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, భరత్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కర్నూలు బాలోత్సవం నిర్వహణలో అధినా స్కూల్‌లో విద్యార్థులకు కంటి సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ జ్యోతి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా స్వాతి హాజరయి మాట్లాడారు. మొబైల్, ట్యాబ్, కంప్యూటర్ దగ్గర నుంచి చూడడం కంటి సమస్యలకు దారి తీస్తుందని తెలిపారు. ఏ వస్తువునైనా 20 నిమిషాలు చూసిన తర్వాత 20 సెకన్లు దృష్టిని మళ్లించాలని తెలిపారు. కంటి సైట్ ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలని, సైట్ పెరగకుండా చూసుకోవాలని సూచించారు. కంటిని అదే పనిగా రుద్దడం వంటివి కంటి అలర్జీకి సంబంధించిందని తెలిపారు. కంటి సమస్య అనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు. మంచి ఆహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్స్‌కు దూరం ఉండాలని తెలిపారు. స్కూల్ ఉపాధ్యాయురాలు గౌతమి సమన్వయం చేయగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం, కర్నూలు బాలోత్సవం నిర్వహకులు వి.వెంకటేశ్వర్లు, మధు, ప్రమోద్, దేవరాజ్, పాఠశాల ఉపాధ్యాయులు మనోహర్, అపర్ణ, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో ఎస్‌హెచ్‌జి ప్రొఫైల్‌పై అవగాహన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ నాగ శివలీల

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు సంబంధించిన మెప్మా సిబ్బంది, ఆర్‌పిలకు న్యూ మున్సిపల్ కౌన్సిల్ హాలులో శనివారం జిల్లాస్థాయిలో ఎస్‌హెచ్‌జి ప్రొఫైల్‌పై మెప్మా పీడీ నాగ శివలీల అవగాహన కల్పించారు. ఉదయం కర్నూలు నగర పాలక సంస్థ సిబ్బంది, ఆర్‌పిలు, మధ్యాహ్నం ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మునిసిపాలిటీ సిబ్బంది, ఆర్‌పిలు పాల్గొన్నారు. మెప్మా పీడీ నాగ శివలీల మాట్లాడుతూ... ఇంత వరకు సంఘాలలో ఉన్న సభ్యులకు సంబంధించి ఒక నిర్దిష్టమైన డేటా లేకపోవడంతో ఇప్పుడు ఎస్‌హెచ్‌జి ప్రొఫైల్ యాప్ ద్వారా ప్రతి ఆర్‌పి తన పరిధిలోని అన్ని సంఘాల వివరాలు, సభ్యుల వివరాలు ఎలాంటి పొరపాట్లు లేకుండా సేకరించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ శిక్షణ తర్వాత రోజూ రెండు సంఘాల చొప్పున కచ్చితమైన వివరాలు తీసుకోవాలని సూచించారు. నవంబర్ చివరి నాటికి జిల్లాలో ఉన్న అన్ని సంఘాలను పూర్తి చేయాలని తెలిపారు. ఈ విధమైన డేటా వల్ల ఫీల్డ్‌లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఉంటుందని చెప్పారు. టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటలక్ష్మీ, ఎఒ ఆసిఫ్ బాష, సిఎంఎం భాస్కర్ రెడ్డి, సిటీ మిషన్ మేనేజర్ సుధాకర్, భారతి పాల్గొన్నారు.

ఇళ్ల తొలగింపు

- వీధిన పడిన నాలుగు కుటుంబాలు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - తుగ్గలి

ఇళ్లను తొలగిస్తున్న అధికారులు

రైల్వే లైన్ డబ్లింగ్ పనుల్లో భాగంగా శనివారం అధికారులు ఇళ్లను తొలగించారు. ఈ ఇళ్లలోని బాధితులు రోడ్డున పడ్డారు. వివరాలిలా ఉన్నాయి... మండలంలోని పెండేకల్ ఆర్ఎస్ గ్రామంలోని స్టేట్ బ్యాంకు ప్రాంగణంలో 4 కుటుంబాలు దాదాపు 90 ఏళ్లుగా స్థిర నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారు. జాలవాడి ప్రసాద్, ఆయన భార్య సునీత, జాలవాడి నాగరాజు, ఆయన భార్య ఆదిలక్ష్మి, జాలవాడి ఆంజనేయులు, ఆయన భార్య అంజలి, జాలవాడి బసవరాజు, ఆయన భార్య నాగలక్ష్మి నివాసం ఉంటున్నారు. అంజలి భర్త గత రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా భారతీయ రైల్వే అధికారులు గుత్తి రైల్వే జంక్షన్ నుంచి పెండేకల్ రైల్వే జంక్షన్ వరకు డబుల్ డబ్లింగ్ రైల్వే పనుల కోసం సర్వే చేపట్టారు. సర్వే ప్రకారం ఎన్నో ఏళ్లుగా ఉన్న కొన్ని కుటుంబాలు వారి ఇల్లు, స్థలాలు రైల్వే స్థలంలోకి వెళ్లాయి. రైల్వే ఉన్నతాధికారులు శనివారం జెసిబి యంత్రాలతో ఇళ్లను తొలగించారు. ఇళ్లను తొలగించడంతో నాలుగు కుటుంబాలు వీధిన పడ్డాయి. దిక్కు తోచని స్థితిలో ఉన్న కుటుంబాలు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందించి, తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు.

సాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులు

ర్యాగింగ్‌కు పాల్పడవద్దు

- కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు ఎవరూ ర్యాగింగ్‌కు పాల్పడవద్దని కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ సూచించారు. శనివారం కర్నూలు నగరంలోని ఎక్యాంపులో ఉన్న మైపర్ ఫార్మసీ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ జె.బాబు ప్రసాద్ హాజరయి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ... పిల్లలు చిన్న వయస్సులో లక్ష్యంతో మంచి నడవడికతో ఉండాలని తెలిపారు. ర్యాగింగ్‌కు పాల్పడకుండా ఉండాలని, ఇప్పుడున్న చట్టాలు ఎంతో కఠినంగా ఉన్నాయని చెప్పారు. వాటికి గురికావద్దని, చాలామంది ర్యాగింగ్‌కు పాల్పడి విలువైన జీవితాలను నాశనం చేసుకున్నారని తెలిపారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ... విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని, ర్యాగింగ్‌కు పాల్పడకుండా ఉండాలని తెలిపారు. జూనియర్స్‌కు ఎలాంటి ఇబ్బందులూ కలిగించవద్దని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కాసర్ల సురేష్, అకాడమిక్ డీన్ డాక్టర్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా టీకాలు

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్ బాబు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

చిన్నారులకు, బాలింతలకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.నాగప్రసాద్ బాబు తెలిపారు. శనివారం కల్లూరు అర్బన్ ముజఫర్ నగర్ పరిధిలోని ఓల్డ్ కల్లూర్ సచివాలయంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు ఇవ్వాలని తెలిపారు. ప్రతి బుధవారం, శనివారం అన్నీ సెషన్లలో ఎఎన్ఎం, ఆశాలు టీకాల కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. వివరాలను ఆర్‌సిహెచ్, యు విన్, హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. గర్భిణులు ప్రభుత్వాస్పత్రిలో కాన్పు అయ్యేటట్లు అవగాహన కల్పించాలని చెప్పారు. డిసిఎం ప్రసాద్, ఎపిడో మైలాజిస్ట్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

వర్సిటీ అభివృద్ధికి కృషి

- రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు తెలిపారు. శనివారం వర్సిటీలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్సిటీలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వర్సిటీలోని బోర్లకు మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. వేసవిలో నీటి సమస్య లేకుండా చేశామన్నారు. వర్సిటీలో పరిపాలనను గాడిలో పెట్టేందుకు ఇన్‌ఛార్జీ వీసీ సహకారంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే ఆయా కోర్సుల్లోని విద్యార్థులకు సకాలంలోనే పరీక్షలు నిర్వహించి, ఫలితాలు వెల్లడిస్తున్నట్లు పేర్కొన్నారు. ర్యాగింగ్ నియంత్రణకు ప్రత్యేకంగా కమిటీలను కూడా వేశామని తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలి

- డిఇఒను కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యా శాఖలో పనిచేసే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల జెఎసి నాయకులు డిఇఒను కోరారు. శనివారం డిఇఒ శామ్యూల్ పాల్‌ను ఉద్యోగ సంఘాల జెఎసి నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎపి ఉద్యోగ జెఎసి జిల్లా చైర్మన్ విసి హెచ్.వెంగల్ రెడ్డి, ఎపి ఎన్‌జిఒస్ రాష్ట్ర సహాధ్యక్షులు దస్తగిరి రెడ్డి, నగర అధ్యక్షులు ఎంసి.కాశన్న, నాయకులు మని శేఖర్ రెడ్డి, కోడుమూరు శ్రీనివాస్, కృష్ణమోహన్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిలేటి, జిల్లా కార్యదర్శి భాస్కర్ రెడ్డి మాట్లాడారు. ఎపి ఎన్‌జిఒస్ జిల్లా కార్యవర్గం ప్రభాకర్ రెడ్డి, సాంబశివారెడ్డి, కెసిహెచ్.కృష్ణుడు, జనార్ధన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, నాయుడు, సాయి రామ్, రాఘవేంద్ర, మునీర్ అహ్మద్ పాల్గొన్నారు.

సాధనతోనే పతకాలు

- సెట్కూరు విశ్రాంత సిఇఒ రమణ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

సాధన, కృషి, దీక్ష ఉంటేనే క్రీడల్లో పతకాలు సాధించ గలమని సెట్కూరు విశ్రాంత సిఇఒ రమణ తెలిపారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని స్కేటింగ్ రింక్‌లో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు సంబంధించి శనివారం బహుమతి ప్రదానం చేపట్టారు. ముఖ్య అతిథిగా రమణ, విశిష్ట అతిథులుగా కర్నూలు మెడికల్ కళాశాల ఫార్మకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్, ఉపాధ్యాయులు శివ శంకర రెడ్డి, వ్యాపారవేత్త నవీద్ అహ్మద్, జిల్లా స్కేటింగ్ సిఇఒ పి.సునీల్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ మాట్లాడారు. స్కేటింగ్ ఒక ఆహ్లాదకరమైన క్రీడా అని, క్రీడాకారులు స్కేటింగ్ సాధనలో ఆనందాన్ని పొందుతారన్నారని తెలిపారు. తన పిల్లలు ఇక్కడే స్కేటింగ్ సాధన చేసి ప్రస్తుతం కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ చేస్తున్నారన్నారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 6 నుంచి కాకినాడలోని డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి స్కేటింగ్ పార్క్‌లో జరిగే రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో జిల్లా తరుపున పాల్గొంటారని స్కేటింగ్ జిల్లా కార్యదర్శి అబు బాకర్ తెలిపారు. స్కేటింగ్ సభ్యులు పునీత చౌదరి, విజయ్ కరణ్, సత్యనారాయణ, సోమా సుధీర్, ఎస్ఎమ్‌డి.ఇర్ఫాన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గీతశ్రీ

రవీంద్ర డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలోని అబ్బాస్ నగర్‌లో ఉన్న రవీంద్ర డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్, ర్యాంప్ వర్ల్డ్ బ్యాంక్ ప్రాజెక్ట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీస్ సీనియర్ కన్సల్టెంట్ ఎం.గీతశ్రీ, రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా గీతశ్రీ మాట్లాడారు. నేడు విద్యార్థులు ఎంతోమంది ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎక్కువ సమయాన్ని వృథా చేస్తూ, కోచింగ్ సెంటర్లలో కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ మేధస్సును దృష్టిలో ఉంచుకొని ఇన్నోవేషన్ ఐడియాలతో ముందుకు రావాలని కోరారు. జి.పుల్లయ్య మాట్లాడుతూ... సమాజంలో మహిళా విద్య ఆవశ్యకతను గుర్తెరిగి 30 ఏళ్ల క్రితమే మహిళా డిగ్రీ కళాశాలను స్థాపించినట్లు తెలిపారు. నేడు ప్రతి రంగంలోనూ స్త్రీలు ముందడుగు వేస్తున్నారని చెప్పారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల డీన్, అకాడమిక్ అడ్వయిజర్ డాక్టర్ మమతా మోహన్, కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి పాల్గొన్నారు.

బెళగల్‌ను కరువుగా ప్రకటించాలి

- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - సిబెళగల్

సిబెళగల్ మండలాన్ని కరువు జాబితాలో చేర్చాలని వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. శనివారం బెళగల్‌కు చేరుకొని సిఐటియు మండల శాఖ కార్యదర్శి ఇబ్రహీం సమక్షంలో సిపిఎం జిల్లా నాయకులు జెమోహన్ అధ్యక్షతన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వలస కూలీలు పెరుగుతున్నారని, వలసలో విద్యార్థులు, బాలికలు, యువత మగ్గుతున్నారని, ఉపాధి కరవయిందని తెలిపారు. మండలంలో చెరువును రిజర్వాయర్ చేస్తే మత్స్యకారులకు, కూలీలకు ఉపాధి దొరుకుతుందని చెప్పారు. రోడ్లను అభివృద్ధి చేయాలని, కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా స్పందన లేదన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రోప్ స్కిప్పింగ్ విజేత చరణ్య

ప్రజాశక్తి - తుగ్గలి

పత్తికొండలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జామ్ జగ్గుల చరణ్య సౌత్ జోన్ నేషనల్ రోప్ స్కిప్పింగ్ విన్నర్‌గా నిలిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు గీత శనివారం తెలిపారు. ఆమె వివరాల మేరకు... తుగ్గలి గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన జె.వీరన్న, జె.అఖిల కుమార్తె చరణ్య అని తెలిపారు. చరణ్యకు ఈ అవార్డు రావడం పట్ల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ పాఠశాలలో విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ పాఠశాలకు మంచి పేరు తెస్తున్నారని తెలిపారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి చొరవ

- మండల లీగల్ సర్వీస్ కమిటీ ఛైర్మన్, జిల్లా అదనపు న్యాయమూర్తి సుధా

ప్రజాశక్తి - ఆదోని

పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఛైర్మన్, జిల్లా అదనపు జడ్జి పిజె.సుధా తెలిపారు. శనివారం ఆదోని కోర్టు హాలులో మెగా లోక్ అదాలత్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. డిసెంబర్ 14న జరిగే మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువమంది కక్షిదారులు హాజరయ్యేలా చూడాలన్నారు. చిన్న సమస్యలు కూడా పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇరువురి ని ఒప్పించి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. సీనియర్ సివిల్ జడ్జి యోగ్యా నారాయణ, జూనియర్ సివిల్ జడ్జి లీలాదాయ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సుభాష, సిఐలు గంటా సుబ్బారావు, సూర్య మోహన్ రావు ఉన్నారు.

పోలీసు అధికారులతో సమావేశమైన జడ్జీలు

పాఠశాలకు సిసి రోడ్డు వేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పాండవగల్లు పాఠశాలకు సిసి రోడ్డు వేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు రామాంజనేయులు, నాయకులు పాండురంగ, కె.గోవింద మాట్లాడారు. పాండవగల్లు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. పాఠశాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక, రోడ్డుపైనే మురుగునీరు ప్రవహించి విద్యార్థులు, ఉపాధ్యాయులు తిరగడానికి ఇబ్బందిగా ఉందని, వెంటనే సిసి రోడ్డు, డ్రెయినేజీ వేయాలని కోరారు. సమస్యను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోవడం లేదని తెలిపారు. విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి సిసి రోడ్డు వేయాలని, లేకపోతే విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు హనుమంత రెడ్డి, తాయన్న పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

జాబ్ మేళా ఓ మంచి అవకాశం

- జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి


జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులు

ప్రజాశక్తి - ఆలూరు

నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు అందిస్తున్న జాబ్ మేళా నిరుద్యోగులకు ఓ మంచి అవకాశమని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్ తెలిపారు. శనివారం జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. శ్రీరామ చిట్స్ అండ్ ఇన్స్యూరెన్స్, యంగ్ ఇండియా ప్రతినిధులు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. దాదాపు 88 మంది నిరుద్యోగ యువత పాల్గొన్నారు. వీరిలో 34 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వీరేష్, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ సాయి తేజ, నాన్ టెక్నికల్ ఆఫీసర్ వి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతు ప్రభుత్వం.. కూటమి...

- టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడారు. జిల్లాలోని పెద్దకడబూరు, కౌతాళం మండలాలను కరువుగా ప్రకటించి రైతులను ఆదుకుంటున్నట్లు తెలిపారు. కరువు మండలంగా ప్రకటించేందుకు కృషి చేసిన రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులకు అభినందనలు తెలిపారు. రైతులు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సేవలను గుర్తుంచుకోవాలన్నారు. రైతులను ఆదుకోవడం కోసమే ఈ మండలాలను కరువుగా ప్రకటించినట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఉల్లిగయ్య

పట్టించుకునే వారెవరు..?

- భవనం భద్రం.. కానీ నిరుపయోగం

- కుక్కలు, పందుల తిష్ట - అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

ప్రజాశక్తి - హొళగుంద

భవనం భద్రంగా ఉంది. కానీ నిరుపయోగంగా ఉంది. ఏవిధమైన కార్యకలాపాలు లేకపోవడంతో కుక్కలు, పందులు తిష్ట వేస్తున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. హొళగుందలో సొంత భవనాలు లేక అవస్థలు పడుతున్న వైనం ఒకవైపు. భద్రంగా ఉన్న భవనాలు నిరుపయోగంగా మారుతున్న వైనం మరో వైపు. హొళగుంద మండలం హర్థగేరిలో రూ.80 లక్షలతో నిర్మించిన ఎస్సీ హాస్టల్ సొంత భవనం నిరుపయోగంగా మారింది.

కరువైన పరిశుభ్రత

భద్రంగా ఉన్న భవనం

భవన నిర్మాణం జరిగి చాలా కాలమైంది. గురుకుల పాఠశాలగా కొనసాగిన ఈ భవనం 8 ఏళ్లుగా మూలనపడింది. కుక్కలు, పందులు, పశువులు, పారిశుధ్య లోపానికి నిలయంగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. ఇదే అదనుగా భావించిన కొందరు ఆకతాయిలు ఈ వసతి గృహాన్ని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారు. మరికొందరు చేతివాటం ప్రదర్శిస్తూ భవనంలో గదుల్లో ఉన్న విద్యుత్ పరికరాలు, తలుపులు, కిటికీలు ఎత్తుకెళ్లారు. భద్రంగా ఉన్న భవనాన్ని వినియోగంలోకి తెచ్చుకునే అవకాశం ఉన్నా అధికారులు దృష్టి సారించకపోవడం విచారకరం. 2016లో హర్థగేరి ప్రభుత్వం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ నిధులు రూ.80 లక్షలతో ఎస్సీ బాలుర వసతి గృహం కోసం సొంత భవనం నిర్మించింది. విశాలమైన 8 గదులతో నిర్మించిన ఈ భవనాన్ని నవంబర్ 11, 2016న డిప్యూటీ సిఎంగా ఉన్న కెఇ.కృష్ణమూర్తి ప్రారంభించారు. పాఠశాల హాస్టల్, ప్రభుత్వ కార్యాలయానికి కానీ వినియోగించలేదు. భవనం నిరుపయోగంగా మిగిలిపోతోంది. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది.

తలుపులు, కిటికీలు దొంగల పాలు...

ఎస్సీ హాస్టల్ భవనం నిరుపయోగంగా ఉండడంతో అందులోని తలుపులు, కిటికీలను దొంగలు ఎత్తుకెళ్లారు. కిటికీల అద్దాలను పగులగొట్టి, కిటికీ గోడల్లో ఉన్న ఇనుప చువ్వలను ఊడబీకి మరీ ఎత్తుకెళ్లారు. ఆకతాయిలు రాత్రి వేళల్లో మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. భవనంలోని వరండా అంతా పగుళ్లు వచ్చి శిథిలమైంది. సోషల్ వెల్ఫేర్ శాఖ ఉన్నతాధికారులు, ఇతర శాఖల అధికారులు దృష్టి సారించి సమన్వయంతో భవనాన్ని ఉపయోగంలోకి తేవాలని ప్రజలు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

ట్రా'ఫికర్'

- తలనొప్పిగా మారిన ట్రాఫిక్ సమస్య

- నియంత్రణలో సిఐ రామాంజులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల వాహనాలతో ట్రాఫిక్ స్తంభించి పోలీసులకు తలనొప్పిగా మారింది. సెలవు రోజులు వచ్చాయంటే చాలు రాత్రికి రాత్రే అమాంతంగా భక్తుల సంఖ్యతో వాహనాల రద్దీ పెరుగుతోంది. పార్కింగ్ స్థలం లేక రోడ్లపైనే వాహనాలను నిలిపేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. శనివారం కూడా అదే పరిస్థితి నెలకొంది. తెల్లవారుజామున 5.30 గంటల నుంచే వాహనాల రాక పెరగడంతో సిఐ రామాంజులు సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణలో తలమునకలయ్యారు. చివరకు చేసేది లేక మిట్ట మధ్యాహ్నం కూడా తానే లాఠీ చేత పట్టుకుని వాహనాలను దారి మళ్లించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు అవస్థలు పడ్డారు. భక్తుల కోలాహలం పెరిగిందంటే చాలు ఇది పరిపాటిగా మారింది. ఈ విషయంపై పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కార మార్గాలు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలని, లేకపోతే ఈ దుస్థితి కొనసాగుతూనే ఉంటుందని భక్తులు, గ్రామస్తులు పేర్కొంటున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు మాత్రం అటు ప్రభుత్వం, ఇటు శ్రీమఠం విధించిన శిక్షగా మారిందని చెబుతున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని భక్తులు వాహన దారులు కోరుతున్నారు.

స్తంభించిన ట్రాఫిక్

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో కోలాహలం నెలకొంది. దీపావళి పండగ సెలవుల నేపథ్యంలో శనివారం స్వామి వారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించారు. మంగళ హారతులు ఇచ్చి, బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో పల్లకోత్సవం నిర్వహించారు. శ్రీమఠం నిర్వహణలో ఉన్న అద్దె గదులు నిండిపోవడంతో భక్తులు ప్రయివేట్ లాడ్జీలను ఆశ్రయించారు.

ప్రజల గుండెల్లో చెరగని ముద్ర.. బీవీ... : టిడిపి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాజీ మంత్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని టిడిపి నాయకులు దయాసాగర్, రాందాస్ గౌడ్, రంగస్వామి గౌడ్, కలీముల్లా, తురేగల్ నజీర్ అహ్మద్ తెలిపారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి బీవీ జయంతి వేడుకలు నిర్వహించారు. బీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి, అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి, ఎమ్మిగనూరు రూపురేఖలు మార్చేసిన ఘనత బీవీ.మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఆయన అడుగుజాడల్లోనే తనయుడు, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. **నందవరం**లోని టిడిపి కార్యాలయంలో బీవీ.మోహన్ రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. నందవరం మండల అభివృద్ధికి కృషి చేసిన ఏకైక వ్యక్తి మాజీ మంత్రి బీవీ అని కొనియాడారు. ప్రజలతో స్నేహభావంతో ఉంటూ, కార్యకర్తలు, నాయకుల గుండెల్లో చెదరని అభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు. బీవీ.మోహన్ రెడ్డి ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని కోరారు. జడ్‌పి మాజీ వైస్ ఛైర్మన్ జంబు పుష్పవతి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఖాసీంవలీ, మండల కన్వీనర్ చిన్న రాముడు, పెద్దరాముడు, మల్లేష్, రామకృష్ణా రెడ్డి, పల్లె తిప్పారెడ్డి, నది కైరవాడి వీరేష్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో కేక్ కట్ చేస్తున్న నాయకులు

నందవరంలో నివాళులర్పిస్తున్న నాయకులు

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) :: ADONI.

I.P. No. 14/2017.

Between:
K. Md. Aslam Hashmi. ...Petitioner.
AND
C.Uligappa & others. ...Respondents.

GENERAL NOTICE.

Whereas the above named Petitioner has filed the above I.P. against the Respondents in this Hon'ble Court to declare the Petitioner as an Insolvent and allow the above petition accordingly.

The above case is posted to 31-12-2024. Therefore You are hereby informed to appear before this Hon'ble Court in person or through a Pleader on 31-12-2024 at 10.30 a.m., failing which the matter will be heard and decided in your absence.

By Order of the Court.

B.Imtiyaz Ahmed,
Advocate for the Petitioner,
Adoni.

Place: ADONI,
Date: 28-10-2024.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) :: ADONI.

I.P. No. 32/2024.

Between:
Y. Ranga Swamy, Son of Y. Venkatesh, Hindu, resident of D.No. 21-403-21, Indira Nagar, ADONI Town. ...Petitioner.
AND
1) Mondi Rangaswamy, S/o Not known, Hindu, R/o Rajiv Gabndhi Nagar, B.C. Hostel Road, SADAPURAM Village, Adoni Mandal, Kurnool Dist.
2) Y. Ramu, S/o Buddanna alias Lakshmanna, Hindu, R/o Opp: Reliance Trends, Ambedkar Nagar, Yemmiganur Road, ADONI Town, Kurnool Dist.
3) Y. Nagesh, S/o Ranganna, Hindu, R/o Venkatapuram Colony, YEMMIGANUR. Kurnool Dist. ...Respondents.

GENERAL NOTICE.

Whereas the above named Petitioner has filed the above I.P. against the Respondents in this Hon'ble Court to declare the Petitioner as an Insolvent and allow the above petition accordingly. The above case is posted to 27-12-2024.

Therefore you are hereby informed to appear before this Hon'ble Court in-person or through a Pleader on 27-12-2024 at 10.30 a.m., failiong which the matter will be heard and decided in your absence.

By Order of the Court

Place: ADONI,
Date: 24-10-2024.

J.Venkatesulu,
Advocate for the Petitioner,
Adoni.

ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధంపై
భారత ప్రభుత్వం స్పందించాలి

- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర

ప్రజాశక్తి- దేవనకొండ

ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధంపై భారత ప్రభుత్వం స్పందించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. శనివారం డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన జెండావిష్కరణ చేపట్టారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధం పేరుతో అమాయక ప్రజల ప్రాణాలను సామ్రాజ్యవాద దేశాలు బలి తీసుకుంటున్నాయని తెలిపారు. ఇజ్రాయిల్, పాలస్తీనాపై ఘోరమైన దాడులు చేస్తూ పసిపిల్లలను పొట్టన పెట్టుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. డివైఎఫ్ఐ మండల నాయకులు చిన్న, వీరేంద్ర, శివ, రవితేజ, సుధాకర్, రవి, కృష్ణ, తేజ, శంకర్, హరి పాల్గొన్నారు. **ఆలూరు**లోని శ్రీరాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా అధ్యక్షత వహించారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ... పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను నిలిపేసి పసిపిల్లలు, మహిళల ప్రాణాలను కాపాడాలని కోరారు. ముందుగా డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు వెంకటేశులు జెండావిష్కరణ చేపట్టారు. డివైఎఫ్ఐ నాయకులు విఠల్, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు బోటయ్య, పురుషోత్తం, షేక్షావలీ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని మేకల బజారులో డివైఎఫ్ఐ మాజీ నాయకులు మాణిక్యం, రాఘవేంద్రలు డివైఎఫ్ఐ జెండాను ఎగురవేశారు. డివైఎఫ్ఐ పట్టణ నాయకులు వీరేష్ అధ్యక్షత వహించారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, పట్టణ కార్యదర్శి సురేష్, నాయకులు వీరేష్, రవి, వెంకటేష్, బాబు, గోపాల్, నర్సప్ప, వీరేష్ పాల్గొన్నారు.

దేవనకొండలో మాట్లాడుతున్న రాఘవేంద్ర

ఆలూరు సెమినార్‌లో మాట్లాడుతున్న నగేష్

పనులు చేయిస్తున్న సర్పంచి

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలి

- సర్పంచి పాల్ దినకరన్

ప్రజాశక్తి - కౌతాళం

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని స్పెషల్ శానిటేషన్‌లో భాగంగా పంచాయతీలోని 5వ వార్డులో డ్రెయినేజ్‌లలో పూడికతీత పనులు చేపట్టినట్లు సర్పంచి పాల్ దినకరన్ తెలిపారు. సర్పంచి పాల్‌దినకర్ ఆధ్వర్యంలో ఇఒఆర్‌డి జనార్ధన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాగ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి బి.శివప్ప సమక్షంలో తలారి గేరి, మసాల గేరి, వివిధ వీధుల్లో వర్షపు నీటితో దోమలు ప్రబలకుండా ప్రత్యేకంగా ప్రయివేట్ ఎరిగేరి కార్మికులతో డ్రెయినేజీ పూడిక తీసి, పూడిక మట్టిని తీసేసినట్లు తెలిపారు.

బడుగు, బలహీన వర్గాలకు సభ్యత్వం ఉచితం

- టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని బడుగు, బలహీన వర్గాల టిడిపి కార్యకర్తలు సభ్యత్వాన్ని తమ కార్యాలయానికి వచ్చి ఉచితంగా నమోదు చేసుకోవచ్చని టిడిపి నాయకులు, దేశాయ్ నెట్‌వర్క్ అధినేత గురురాజ్ దేశాయ్ తెలిపారు. శనివారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని తెలిపారు. సభ్యత్వ నమోదు వల్ల కార్యకర్తకు రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని చెప్పారు. ఆయన తన దేశాయ్ నెట్‌వర్క్ కార్యాలయంలో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసమే ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఆది, గురువారాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. 2 వేల మంది వరకు ఉచితంగా సభ్యత్వాన్ని తమ సొంత నిధులతో చేయిస్తామని తెలిపారు. మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి జయంతి సందర్భంగా పేదలను ఆదుకోవాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలోని మేదర్ వీధి దగ్గర నూతన బ్రిడ్జి వద్ద ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పూజలు నిర్వహించి ప్రారంభించారు. రాష్ట్రంలో ఎక్కడా రోడ్లలో గుంతలు లేకుండా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం 'మిషన్ పార్ట్ హోల్ ఫ్రీ ఎపి' కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. ఆర్అండ్‌బి ఈఈ వెంకటేశ్వర్లు, నాయకులు విట్టా రమేష్, బలరామ్ పాల్గొన్నారు. **తుగ్గలి** మండలంలోని ఎద్దులదొడ్డి గ్రామంలో పత్తికొండ-ప్యాపిలి, తుగ్గలి-గుత్తి బిటి రోడ్ల మరమ్మతులు చేసేందుకు జడ్‌పి మాజీ ఛైర్మన్ బత్తిన వెంకట రాముడు, మాజీ జడ్‌పిటిసి సాంబశివారెడ్డి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ సహకారంతో ఈ రోడ్లకు మరమ్మతు పనులు చేసేందుకు రూ.11 లక్షల నిధులు మంజూరు చేయించారని వారు తెలిపారు. ఆర్అండ్‌బి డీఈఈ శివ రుద్ర కుమార్, ఏఈఈ శ్వేత, కాంట్రాక్టర్ చెన్నంపల్లి సంజీవ చౌదరి, సర్పంచి రాముల విజయ్, టిడిపి నాయకులు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ఆదోనిలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

అలసందగుత్తిలో వాటర్ ప్లాంట్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని అలసంద గుత్తి గ్రామంలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆడిటర్ అలసందగుత్తి వీరారెడ్డి కుమారుడు ఆడిటర్ సాయినాథ్ రెడ్డి జ్ఞాపకార్థం నటరాజ్ స్వామి చేతుల మీదుగా వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండడం, బోర్లలో ఫ్లోరైడ్ ఎక్కువ ఉన్నందు వల్ల గ్రామస్తులు ఫ్లోరైడ్ బారిన పడకుండా వాటర్ ప్లాంట్ ఉపయోగపడుతుందని తెలిపారు. రూ.4 లక్షలతో ఆడిటర్ సాయినాథ్ రెడ్డి కుమారులు ఆడిటర్ సోమశేఖర్ రెడ్డి, రవిప్రకాష్ రెడ్డి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. సర్పంచి రామకోటి రెడ్డి, మండగిరి మాజీ సర్పంచి శేషిరెడ్డి, అక్షరశ్రీ జూనియర్ కళాశాల అధినేతలు సుధాకర్ రెడ్డి, మేఘనాథ్ రెడ్డి, శ్రీవిద్యా స్కూల్ అధినేత వినోద్ రెడ్డి, భారత్ గ్యాస్ అధినేత మల్లికార్జున రెడ్డి, శ్రీరామ గ్రానైట్ అంగడి అధినేత అర్జున్ రెడ్డి, కాంట్రాక్టర్ పాండు రంగారెడ్డి, గ్రామపెద్ద శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నటరాజ స్వామి

వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

- నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలో వాణిజ్య సంస్థలు, వ్యాపారులు తప్పనిసరిగా నగరపాలక సంస్థ ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరణ చేసుకోవాలని, లైసెన్స్ లేని వారు వెంటనే తీసుకోవాలని, లేకపోతే సంబంధిత దుకాణంపై చర్యలు తీసుకుంటామని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ హెచ్చరించారు. శనివారం నగరపాలక కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో ఆరోగ్యాధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి పారిశుధ్య తనిఖీదారులతో ట్రేడ్ లైసెన్సుల జారీ, పునరుద్ధరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రేడ్ లైసెన్సుల ఫీజుల రూపంలో నగరపాలకకు ఆదాయం రావాల్సి ఉందని తెలిపారు. వాటిపై పారిశుధ్య తనిఖీదారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. శానిటేషన్ సెక్రటరీలను ఆయా సచివాలయ పరిధిలో పర్యటించేలా చూడాలని, ప్రతి దుకాణదారుడు, వ్యాపారుడు ట్రేడ్ లైసెన్స్‌ను తీసుకునేలా, పునరుద్ధరణ చేసుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. డిమాండ్‌కు తగ్గట్టుగా లక్ష్యాన్ని చేరుకోవాలని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ స్వర్ణలత, ఎఫ్-2 వీరకుమార్ పాల్గొన్నారు.

మరమ్మతు పనుల పరిశీలన

వెంకటరమణ కాలనీలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న మరమ్మతు పనులను నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ పరిశీలించారు. మిగిలిన మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఒ జునైద్, ఆర్ఐ తిప్పన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ

ఓటరు జాబితా సిద్ధం చేయాలి

- తహశీల్దార్ శివరాముడు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

నీటి సంఘాల ఎన్నికలకు ఓటరు జాబితా సిద్ధం చేయాలని తహశీల్దార్ శివ రాముడు పేర్కొన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి నీటి సంఘాల ఓటరు జాబితాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని పెద్దహరివాణం, సంతేకుడ్లూరు, యడవలి, బలాదూర్, చిన్నగోనేహాళ్, మదిరే, బసాపురం, ఇస్వీ, ఢణాపురం, నాగనాథనహళ్లి గ్రామాలకు సంబంధించి నీటి సంఘాల ఎన్నికల ఓటరు జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. ఆయా పంచాయతీ కార్యాలయాల్లో ఈనెల 6 నుంచి 10 వరకు ప్రచురించి సందేహాలుంటే 11 నుంచి 12 వరకు దరఖాస్తులను స్వీకరించాలని చెప్పారు.

రాష్ట్రస్థాయికి ఎరిగేరి విద్యార్థులు

ప్రజాశక్తి - కౌతాళం

ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపి ఎరిగేరి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రాము తెలిపారు. శనివారం వారు మాట్లాడారు. అండర్-17 సాఫ్ట్ బాల్ విభాగంలో రాఘవ, శారద, అండర్-14 సాఫ్ట్ బాల్ విభాగంలో చైతన్య, పూజ ఎంపికైనట్లు తెలిపారు. అండర్-14 కబడ్డీ పోటీలకు నీలకంఠ, అండర్-14 అథ్లెటిక్స్ విభాగంలో ఈరన్న, అండర్-17 ఖోఖో విభాగంలో హరికృష్ణ ఎంపికైనట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు, ఎస్ఎంసి ఛైర్మన్ శ్రీరాములు మాట్లాడుతూ... క్రీడలు ప్రతి విద్యార్థి జీవితంలో భాగం కావాలని తెలిపారు. క్రీడలతో విద్యార్థులు క్రమశిక్షణ నేర్చుకోవడమే కాకుండా గెలుపోటములను సమానంగా చూసే ధోరణి ఏర్పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. నాయకులు రామలింగప్ప, బసవరాజు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, అబ్దుల్ రహీం, నల్లన్న, రంగారెడ్డి, రంగన్న, రమేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

- కమిషనర్ రవీంద్ర బాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు తెలిపారు. శనివారం చౌరస్తా సమీపంలో ఎస్‌ఎపి క్యాంపు మీదుగా కొత్త రహదారి నిర్మాణానికి సంబంధించి మార్కింగ్‌ను కమిషనర్, 2వ పటాలం కమాండెంట్ ఎస్.మాహబూబ్ బాషతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. చౌరస్తా కూడలిలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు, హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలను చౌరస్తా సమీపంలో ఎస్‌ఎపి క్యాంపు మీదుగా ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోకి మళ్లించేందుకు రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే రహదారి నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. అనంతరం కమిషనర్ టీచర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్, వెంకటేశ్వర వెంచర్ సమీపంలో రహదారి నిర్మాణానికి సంబంధించి పనులను పరిశీలించారు. సిపి ప్రదీప్ కుమార్, ఎఇ నాగజ్యోతి పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - చిప్పగిరి

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించి ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు. శనివారం చిప్పగిరి నుంచి గుంతకల్ వెళ్లే రహదారిలో వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవర్‌కున్న అర్హత రసీదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రమాదాలు చెప్పి రావని, వాహనం నడిపే సమయంలో జాగ్రత్త అవసరమని తెలిపారు. డ్రైవర్‌కు సంబంధించిన సమాచార రసీదులను వాహనంలో ఉంచుకోవాలని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం నేరమన్నారు. ద్విచక్ర వాహనాల్లో ఎక్కువ మంది వెళ్లడం మంచిది కాదన్నారు. పోలీసులు సాగర్, షబ్బీర్ బాష పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత : తనిఖీల్లో భాగంగా ఓ ఆటోను ఆపారు. అందులో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించి స్టేషన్‌కు తరలించారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

మహారాజశ్రీ గౌరవనీయులైన రెండవ అదనపు జిల్లా జడ్జ్ కోర్ట్ ఆదోని

Guardian O.P. No. 20/2024.

Between :
B. ఖాజ బాను W/o. Late B.S. ఉస్మాన్, వయస్సు 30 సం. ముస్లిం, R/o. ఇంటి నెంబర్: 25-262, హవన్న పేట్, ఆదోని టౌన్, కర్నూలు జిల్లా. .... **పిటిషనర్**
V/s
To Whom So ever it may coscem (NIL) .... **రెస్పాండెంట్స్**

నోటీసు టూ పబ్లిక్

ఆదోని మండలము, కర్నూలు జిల్లా కాపురస్తురాలు అయిన బి. ఖాజ బాను W/o the B.S. ఉస్మాన్, D.No. 25/262, హవన్నపేట్, ఆదోని సంస్థ ప్రజానికానికి తెలియజేయడు ఏమంగా తన భర్త B.S. ఉస్మాన్ పేరు మీద Doc. No. 6710/2014, Dt. 04-09-2014, ద్వారా రిజిష్టర్ గిఫ్ట్ డీడ్ పొందియున్నారు. 25-11-2020 తేదినాడు నా భర్త అయిన B.S. ఉస్మాన్ చనిపోయినాడు. ఆయనకు నేను భార్య కావలెను. మాకు ఇద్దరు సంతానం కలరు వారి పేర్లు : 1) B. Mohammed Ayaan, 2) B. Mohammadi, ఈ ఇద్దరు మైనర్ సంతానము. నా సంరక్షణలో ఉన్నారు. కాబట్టి పై కనిపించిన డాక్యుమెంట్ అమ్మడానికి కోర్ట్ వారుకు అనుమతి కోరుతున్నాను. నాకు నా మైనర్ పిల్లలకు చదవడానికి చాలా ఇబ్బంది ఉండడం వలని పై కనబరచిన డాక్యుమెంట్ అమ్మడానికి. నా పిల్లల భవిష్యత్ కొరకు వారి కోశనర్థం మరియు సంరక్ష, ఆరోగ్యం, చదువుల కోసం ఈ కేసులో కరిపించిన ఆస్తి అమ్మడానికి నేడు అనుమతి కొరకు మహారాజ శ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి గారికి ఆదోని, కర్నూలు జిల్లా సూచించిన Guardian Petition No. 20/2024 దాఖల చెసి ఉన్నాను. కాబట్టి ఎవరికైన ఎటువంటి ఆక్షేపణలు గాని అభ్యంతరములగాని ఉన్నచో 14.11.2024 ఉదయం 10:30 AM గంటలకు గౌరవ రెండవ అదనపు జిల్లా కోర్ట్ కర్నూలు అట్ ఆదోని న్యాయస్థానం ముందు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు అభ్యంతరాలు ఉన్నచో తెలుపగలరు. ఒక వేల ఎవరు హాజరు కానీ యెడల పై గౌరవ న్యాయస్థానంపై కనపరిచిన పిటిషనర్స్ తరపున తగిన తీర్మానం చేయడం జరుగుతుంది.

షెడ్యూలు

House Plot bearing No. 2 in Sy.No. 266/1 Ac.0.40 cents pyki of Adoni and Adoni Municipal limits situated near old water tank in Ist. ward Bharpet Adoni and in the Registration District of Kurnool & Sub. Registration District of Adoni and bouned as follows:

Boundaries:
East: Plot bearing No.3 belongs to B. Hussain & B. Malan Bee.
West: T.K.Asif Plot No. 1. and 12 feet vide Rastaha.
North: Jagirdar Ismail open site (sold).
South: 14 feet vide Rastha (Road).

Measurements:
East to West on 22 feet or 6.70 meters North to South on eastern side: 29.50 feet or 8.99 meters North to South on western side: 32.50 feet or 9.90 meters Total extent is 75.77 sq. yards.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ : 14-11-2024

K.S. TABREZ
అడ్వోకేట్ ఫర్ పిటిషనర్, ఆదోని.